


## *అనగనగా ఒక అతిథి*

1999 జనవరి ఆఖరివారంలో ఓ రాత్రి ఏడుగంటలకి 'వార్త' సండే సప్లిమెంట్లో సబ్ ఎడిటర్స్‌గా పనిచేసే శ్రీ దోర్బలశర్మ, శ్రీ వేదాంత సూరి మా ఇంటికి వచ్చారు. పేరు చెప్పనుకాని మీ అందరికీ తెలిసిన ఓ రచయిత సీరియల్ ఆ రోజు తమకి అందాలని, ఆయన సీరియల్ ఇవ్వకపోవడంతో నా చేత డైలీ సీరియల్ రాయించమని వార్త ఎడిటర్ కె.రామచంద్రమూర్తిగారు కోరారని చెప్పారు. ఆ రాత్రి పన్నెండులోగా సీరియల్ కావాలని కోరారు. బహుశా అడ్వాన్స్ ఇవ్వకపోవడంతో ఆ రచయిత వెనక్కి వెళ్ళి ఉంటాడని భావించాను.




నేను అప్పటికే మా ఇంట్లో జరిగిన వింత అనుభవాలతో ఓ నవల రాద్దామని ప్లాన్ చేసి ఉంచుకున్నాను. దాంతో వెంటనే మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ రాసి, స్క్రిప్ట్‌తో రాత్రి పదకొండుకి 'వార్త' ఆఫీస్‌కి వెళ్ళి, డైలీ సీరియల్ ఇన్‌ఛార్జ్‌కి ఇచ్చాను. అలా మొదలై వందరోజులు కొనసాగిన సీరియల్ అనగనగా ఒక అతిథి.

మా ఇంట్లో అద్దెకి ఉన్న వాళ్ళ పిల్లలు ఊజా బోర్డ్ ద్వారా మరణించిన తమ తాతయ్యని పిలిచి మాట్లాడటం మా పెద్దపిల్లలు ఇద్దరూ చూసారు. మనం అలా చేద్దామని వాళ్ళు నన్ను కోరినా నేను ఒప్పుకోలేదు. ఊజా బోర్డ్ చేస్తే బేడ్ ఈవిల్స్ వచ్చి ఇక వెళ్ళవని విన్నాను.

1998 దసరా సెలవలకి మా పిల్లలు వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడు మా పెద్దమ్మాయి కావ్య ఊజా బోర్డ్ చేస్తే వాళ్ళ తాతయ్య వచ్చాడని తిరిగి వచ్చాక చెప్పింది. మనం కూడా చేసి మా నాన్నగార్ని పిలుద్దామని కోరింది. నేను అది నమ్మక కొట్టిపారేసాను. కానీ పదే పదే అడుగుతూండటంతో 13 నవంబర్ నా పుట్టినరోజున చేద్దామని చెప్పాను. కానీ అనుకోకుండా 8 నవంబర్ 1988 రాత్రి పిల్లలు ఊజా బోర్డ్ చేసారు. మా నాన్న మల్లాది దక్షిణామూర్తిగారి ఆత్మ నిజంగా వచ్చింది. మా తల్లితండ్రుల తొలి సంతానం పేరు బాబీ అని, వాడు ఎలా మరణించాడో చెప్పారు. మా నాన్నగారు మరణించిన మంచం రంగు

కూడా ఆ ఆత్మ కరెక్ట్‌గా చెప్పింది ఈ విషయాలేవో బోర్డ్‌మీద రాసిన ఏ నించి జడ్ దాకా ఇంగ్లీష్ అక్షరాల మీదకి కాయిన్ లేదా గ్లాస్ వెళ్తే చూసి అది రాసుకోవాలి. ఇదీ ఊజా బోర్డ్ ద్వారా ఆత్మ చెప్పే పద్ధతి. అనగనగా ఒక అతిథిలో అవతలి ప్రపంచం విశేషాలని మా నాన్నగారి ఊజా బోర్డ్‌లో చెప్పినట్లుగా యథాతథంగా రాసాను.

ఓసారి నా పాస్‌పోర్ట్ అర్జెంట్‌గా కావాల్సి వచ్చింది. రెండు రోజులు వెదికినా అది కనపడలేదు. మా నాన్నగారి ఆత్మని అడిగితే కాయిన్ బీరువా దగ్గరకి వెళ్తూంటే, దానిమీద వేలుంచిన మా రెండో అమ్మాయి ఊహ నేలమీద పాకుతూ దాంతోపాటు వెళ్ళింది. బీరువా తలుపు తెరిస్తే కింది అరలోకి కాయిన్ ఎక్కింది. అందులోని బట్టలన్నీ తీస్తే అడుగున ఉన్న పాస్‌పోర్ట్ కవర్ కనిపించింది. ఇలా ఎన్నో సంఘటనలతో ఆత్మ ఉనికి మీద, పిలిస్తే రావడం మీద నాకు నమ్మకం ఏర్పడింది. ఇలాంటి డజన్ల కొద్దీ అనుభవాలతో దాన్ని నమ్మి రాసిన నవల ‘అనగనగా ఒక అతిథి.’ స్థూలంగా కథ ఇది.




ఓ మధ్య తరగతి కుటుంబం తమ మిత్రుల ఇంట్లో ఊజా బోర్డ్ చేయడాన్ని చూసి నమ్మకపోయినా మొదలుపెడుతుంది. త్వరలోనే తన తండ్రి ఆత్మ నిజంగా వచ్చిందని ఆ ఇంటి పెద్ద గంగాధర్ నమ్ముతాడు. ఆ ఆత్మ వాళ్ళింట్లోని అనేక సమస్యలకి పరిష్కారం చూపిస్తుంది. గంగాధర్ పోలీస్ శాఖలో పనిచేస్తాడు. ఓ రోజు ఓ సిఐకి ఊజా బోర్డ్ గురించి చెపితే, సిఐ తన ఎస్‌పితో చెప్తాడు. ఓ గడ్డు కేసులో హతుల శవాలు ఎక్కడున్నాయో తెలుసుకోడానికి ఆయన ఈ కుటుంబం నుంచి ఊజా బోర్డ్ సహాయం తీసుకుంటాడు. శవాలు దొరకడంతో ఈ విషయం టివిలో, దినపత్రికల్లో వస్తుంది. హంతకుడ్ని అరెస్ట్ చేసి అతని మీద కేస్‌ని బుక్ చేస్తాడు. ఊజా బోర్డ్ ద్వారా ఆ రహస్యాన్ని చెప్పిన గంగాధర్ కూతురు నిహితని హంతకుడి తరఫు వాళ్ళు కిడ్నాప్ చేసి అతనికి శిక్ష పడితే నిహితని చంపేస్తారని బెదిరిస్తారు. నిహితని వాళ్ళు ఎక్కడ దాచారో తాత ఆత్మ చెప్పగలదు. కానీ నిహిత పిలిస్తే మాత్రమే ఆ ఆత్మ వస్తుంది. మరెలా? ఈ చిక్కుముడి వీడి ఆత్మద్వారానే నిహిత రక్షించబడటంతో కథ సుఖాంతం అవుతుంది.

ఇది సీరియల్‌గా వచ్చినప్పుడు పాఠకులు ఆత్మ ఊజా బోర్డ్ మీదకి వస్తుందని నమ్మారు. కారణం పాఠకులు నేను నిజాయితీగా రాసానని నమ్మడం, వారికి నామీద గల విశ్వాసం. మా ఇంటి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్లోని ఒకరి భర్త (పేరు గోపాల్ అని గుర్తు) ముప్పయ్యేళ్ళతను రోడ్ ప్రమాదంలో మరణించాడు. మిత్రులతో కలిసి ఉమ్మడి వ్యాపారం చేసే అతని ఆస్థులు, అప్పులు గురించి ఏమీ ఎవరికీ తెలియదు. ఢిల్లీనించి వచ్చిన అతని అత్తమామలు నమ్మకపోయినా మా ఇంటికి వచ్చారు. అతని ఆత్మ వచ్చి ‘కాల్ పద్మ’ అని చెప్పింది. భర్తపోయి మూడురోజులే అయింది, మరి పద్మ మా ఇంటికి రావడానికి మేం ఒప్పుకుంటామా? అని అడిగగే మాకు అభ్యంతరం లేదని చెప్పాం. పద్మ వచ్చాక అతని ఆత్మ ఆర్గనైజర్ అని చెప్పింది. అంటే ఏమిటో మాకు తెలీదు. అతనికి ఓ ఆర్గనైజర్ ఉండేది. ఆ ఆర్గనైజర్ ఎక్కడ ఉంది, దాని పాస్‌వర్డ్‌ని కూడా ఆత్మ చెపితే అందులో వారికి

కావాల్సిన సమాచారం మొత్తం లభించింది. ఓ జర్నలిస్ట్ కం రచయిత్రి కూడా తన తండ్రి ఆత్మతో మాట్లాడటానికి వచ్చారు కాని ఆయన ఆత్మ రాలేదు.

మంత్రిగా పనిచేసిన ఓ రాజకీయ నాయకుడు కూడా హఠాత్తుగా మరణించిన తన తోడల్లుడి ఆత్మనించి ఆస్థి వ్యవహారాలు తెలుసుకోడానికి ఓ కుటుంబ మిత్రుడితో వచ్చాడు. అవి రహస్యంగా తెలుసుకోవాలని మా అందర్నీ బయటకి వెళ్ళమని కోరాడు. తర్వాత వెళ్తూ కావ్యతో హెచ్చరికగా చూపుడు వేలుని ఊపుతూ 'పాపా! ఎవ్వరికీ చెప్పక. చెప్తే మంచిగుండదు.' అని పదే పదే హెచ్చరించి వెళ్ళాడు. పద్మజ కొంతకాలం కావ్య స్కూల్ నుంచి వచ్చేదాకా ఆదుర్దా పడేది. రాజకీయాల వాళ్ళు కాబట్టి దాన్ని కిడ్నాప్ చేసి చంపేస్తారని భయపడింది. ఆ తర్వాత ఎవ్వరు అడిగినా 'నో' చెప్పాం. మరో రాజకీయ నాయకుడి కొడుకు కూడా తన ఇంటికి ఊహని ఊజా బోర్డ్‌తో పంపమని కోరాడు. ఏదో చెప్పి పంపలేదు.

ఇరగవరం నించి గంగాధరం అనే పాఠకుడు తన తల్లి ఆత్మతో మాట్లాడాలని నా దగ్గరకి వచ్చాడు. మేం ఊజా బోర్డ్ చేయడం మానేసామని చెప్పాను. కనీసం ఆత్మలతో మాట్లాడించే వ్యక్తి గురించి తెలుసుకుని చెప్పమని కోరాడు. అప్పటినించి ఇంతదాకా అతను తరచు ఫోన్ చేసి తన తల్లితో మాట్లాడటానికి సహాయం చేయమని కోరుతూనే ఉన్నాడు. వారం క్రితం కూడా గంగాధరరావు గారి నించి ఫోన్ వచ్చింది. తల్లి ఆత్మతో మాట్లాడాలనే కాంక్ష అతనికి అంత తీవ్రంగా ఉంది.

జులై 1999లో ఇది లిపి పబ్లికేషన్స్ నించి పుస్తకంగా వెలువడింది. వెల రూ.60/ కాపీలు ఆశించిన దానికన్నా త్వరగా అమ్ముడైపోయాయి. ఐతే ఉజా బోర్డ్ ద్వారా ఆత్మలని ఆహ్వానించడం వల్ల చెడు జరుగుతుందని వ్యక్తిగతంగా నాకే కొంత చెడు జరిగి తెలియడంతో ఈ పుస్తకాన్ని మలిముద్రణ చేయలేదు.

లిపి పబ్లికేషన్స్ స్థాపనలో నాకు సహకరించిన మిత్రులు శ్రీ శ్రీనివాసా పబ్లికేషన్స్ అధినేత శ్రీ సుబ్బయ్యగారికి కృతజ్ఞతగా నేను ఐదు పుస్తకాలని ప్రచురణకి ఉచితంగా ఇచ్చాను. వారు కోరుకున్న ఐదింటిలో అనగనగా ఒక అతిథి కూడా ఉంది. కాదనలేక దాన్ని నాలుగేళ్ళ తర్వాత ఇచ్చాను. డిసెంబర్ 2003లో ఆయన దాన్ని ప్రచురించారు. వెల రూ.60/- కన్నడంలోకి కూడా ఈ నవల అనువదించబడింది.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***